# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 29-03-2017**

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని, ఈ అభివృద్ధి ఫలాలు అత్యధిక సంఖ్యలో వున్న నిరుపేదలకు, బడుగు బలహీన వర్గాలకు అందాలన్నదే తన అభిమతమని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. మెస్ చార్జీల పెంపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పలు సంఘాలు, నాయకులు, విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం వారినుద్దేశించి మాట్లాడారు. ‘‘ఉద్యమ సమయంలో చెప్పినట్లు తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బాగుంది. దాదాపు 15 శాతం వృద్ధి రేటున్నది. రాబోయే కాలంలో బడ్జెట్ కూడా బాగా పెరుగుతుంది. సంపద పెరుగుతుంది. పెరిగిన సంపద పేదలకు ఉపెయోగపడాలి. పేదల జీవితాల్లో మార్పురావాలి. అందుకోసమే తెలంగాణ రాష్ట్రంలో వ్యయానికి వెనుకకు పోకుండా వేల కోట్లు వెచ్చించి చాలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా. ఎప్పటి నుంచో మెస్ చార్జీలు పెరగక, పెరిగిన ధరలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే మెస్ చార్జీలు పెంచాము. బావి తరాలు బాగుండి, బాగా ఎదగాలన్నదే నా తపన. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వారిలో పేదలే ఎక్కువ. ఆయా వర్గాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెరగాల్సిన అవసరం ఉంది. దానికి మేము కట్టుబడి ఉన్నాం. రాష్ట్ర స్థాయిలో మనం చేసే ప్రయత్నాలు చేసి కేంద్రంపై కూడా వత్తిడి తెస్తాం. ఎస్టీ, ముస్లింలతో పాటు బిసిల రిజర్వేషన్ శాతం కూడా పెరగాల్సి వుంది’’ అని ముఖ్యమంత్రి అన్నారు.

విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడం పట్ల వివిధ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ప్రగతి భవన్లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుని కలిసి అభినందించారు.

ఎంపి శ్రీ బాల్క సుమన్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థి నాయకులు, విద్యార్థులు మంగళవారం పెద్ద సంఖ్యలో ప్రగతి భవన్ తరలివచ్చి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును కలిశారు. విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో విద్యార్థి నాయకులైన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీ బాబా ఫసీయుద్దీన్, రాకేశ్, వాసుదేవరెడ్డి, శ్రీనివాస యాదవ్, ప్రవీణ్ రెడ్డి, బాలు, అవినాశ్, స్వామి తదితరులున్నారు.

ఎమ్మెల్యే శ్రీ ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో పలు బిసి సంఘాలు ప్రగతి భవన్లో ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. శాలువాలు కప్పి సన్మానించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణయ్యతో పాటు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ జాజుల శ్రీనివాస గౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీ గుజ్జ కృష్ణ, బిసి ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ శ్రీ ఎర్ర సత్యనారాయణ, సర్పంచ్ ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీ బూమన్న యాదవ్, బిసి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కె. కృష్ణుడు, బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడం వల్ల వారికి మంచి ఆహారం లభిస్తుందని, రేపటి పౌరులు చక్కగా ఎదగడానికి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కృష్ణయ్య అన్నారు. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్ కల్పించడానికి ప్రధానమంత్రి దగ్గరికి అఖిలపక్షాన్ని తీసుకుపోవాలని ఈ సందర్భంగా బిసి సంఘాలు ముఖ్యమంత్రిని కోరాయి.

విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచిన ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఎంబిసిల సంఘం అభినందించింది. ఎంబిసిల సంఘం అధ్యక్షుడు శ్రీ కాళప్ప, నాయకులు శ్రీ సూర్యారావు, ప్రేమ్ లాల్, శేఖరాచారి, నర్సింగ రావు, అంతయ్య, సత్యం వంశిరాజు, విష్ణువర్ధన్ రాజు, శ్రీనివాసరావు తదితరులు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపారు.

మెస్ చార్జీలు పెంచడం పట్ల తెలంగాణ ఎన్జీవోలు, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుల ముఖ్యమంత్రిని అభినందించారు. టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కారం రవీందర్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు శ్రీ దేవీ ప్రసాద్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎల్. శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి శ్రీ పవన్ కుమార్ తదితరులు సిఎంను కలిసి అభినందనలు తెలిపారు.

హోటల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నాయకులు శ్రీ వెంకటరెడ్డి నాయకత్వంలో పలువురు సంఘ సభ్యులు మంగళవారం ప్రగతి భవన్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పన్నుల విధానం వల్ల హోటళ్ల నిర్వహణ కష్టంగా ఉందని చెప్పారు. ప్రధాని వద్దకు తమ ప్రతినిధి బృందాన్ని తీసుకెళ్లి సమస్యలు వివరించాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**